VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
శుక్రవారం 22 మార్చి 2024
సంపుటి.01 సంచిక.223

# కేసీఆర్ శకం ముగిసింది

## భారాస అధినేత, మోదీ.. ఇద్దరివీ అప్రజాస్వామిక విధానాలే

## లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అనూహ్య ఫలితాలు

## కాంగ్రెస్‌కు 12 నుంచి 14 సీట్లు వచ్చే అవకాశం

## భారాసను ఇప్పటికే ప్రజలు తిరస్కరించారు

## ఇప్పుడు భాజపాకూ అదే గతి

**'జాతీయస్థాయిలో నరేంద్ర మోదీ, రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ ఇద్దరూ ఒకేరకం. వారు నాణేనికి బొమ్మ, బొరుసు లాంటి వారు. అప్రజాస్వామిక విధానాలు, హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో ఇద్దరికీ తేడా లేదు' అని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.**




**తెలంగాణ పునర్నిర్మాణానికి నాందివంద రోజుల్లో తెలంగాణ పునర్నిర్మాణానికి నాంది పలికాం. ప్రగతిభవన్ గడీలను బద్దలు కొట్టి అందరికీ ప్రవేశం కల్పించాం. ఇక్కడే ప్రజావాణి నిర్వహిస్తున్నాం. గతంలో ఇందులోకి ప్రజల మాట అటుంచి ఎమ్మెల్యేలకు కూడా ప్రవేశం ఉండేది కాదు. ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్‌ను పునరుద్ధరించాం. ఇప్పుడు భారాస వాళ్లు కూడా అక్కడ ధర్నాలు చేసుకొనే పరిస్థితి. అంటే చివరకు భారాసకు కూడా కాంగ్రెస్ వల్ల స్వేచ్ఛ లభించింది. ఇవన్నీ చిన్న విషయాలు కాదు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకొనే పరిస్థితి ఏర్పడింది. దీనికి కారణం ప్రజలే. మాపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో గెలిపించడం వల్లే ఇది సాధ్యమైంది. వారి విశ్వాసాన్ని వమ్ముచేయం. వారి అభివృద్ధికి నిరంతరం పాటుపడుతూనే ఉంటాం.**
**సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: 'జాతీయస్థాయిలో నరేంద్ర మోదీ, రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ ఇద్దరూ ఒకేరకం. వారు నాణేనికి బొమ్మ, బొరుసు లాంటి వారు. అప్రజాస్వామిక విధానాలు, హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో ఇద్దరికీ తేడా లేదు' అని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షునిగా పార్టీని, ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన వ్యూహాలు తనకు ఉంటాయని అన్నారు. ఇప్పటికే కొన్ని స్థానాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించిందని,. ఈ నెల 27 లేదా 28 కల్లా అన్ని స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అనూహ్య ఫలితాలు సాధిస్తు ందని చెప్పారు. బలమైన అభ్యర్థులు, సామాజిక సమీకరణాలు.. ఇలా అన్నీ పరిగణనలోకి తీసుకొనే మా పార్టీ అధిష్ఠానం అభ్యర్థులను ఎంపిక చేస్తోందన్నారు. రాష్ట్రంలో 12 నుంచి 14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు.

**మసకబారిన మోదీ ప్రభావం**

నరేంద్ర మోదీ ప్రభావం మసకబారింది. మాటలు చెప్పి పని చేయకుంటే ఎంత కాలం ప్రజలు నమ్ముతారు? భారాసను ఇప్పటికే తిరస్కరించిన ప్రజలు, లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కూడా ఇదే రకమైన తీర్పు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ రెండు పార్టీలు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఎన్నికల ముందు అన్ని రకాల డ్రామాలకు తెరలేపుతున్నారు. లోపల మాత్రం పరస్పరం సహకరించుకొందాం అన్నట్లుగా మొత్తం వ్యవహారం నడుస్తోంది.

**పార్టీ పని, ప్రభుత్వ పనిలో స్పష్టమైన తేడా ఉంటుంది**

మనది ఫెడరల్ వ్యవస్థ. ప్రధానమంత్రి అన్ని రాష్ట్రాలకు బాధ్యత వహిస్తారు కాబట్టే ఇటీవల రాష్ట్రానికి వచ్చినప్పుడు ఆయన్ను కలిశా. పెద్దన్న అని సంబోధించా. పార్టీ వేరు, ప్రభుత్వం వేరు. ప్రధానమంత్రిగా వచ్చారు, ముఖ్యమంత్రిగా స్వాగతం చెప్పా, రాష్ట్రానికి ఏమేం కావాలో కోరా. ప్రధానికి అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన బాధ్యత ఉంది. కానీ సర్కారు, పరివార్, పార్టీ అన్నీ ఒకటే అనుకొంటారు మోదీ. మేం అలా కాదు. ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాలు, అభివృద్ధి.. ఇలా అనేక అంశాలు ముఖ్యం. పార్టీగా రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడం, సైద్ధాంతిక పోరాటం, ప్రజల హక్కులు కాపాడటం వంటి కార్యక్రమాలు ఉంటాయి. పార్టీ పని, ప్రభుత్వ పనిలో స్పష్టమైన తేడా ఉంటుంది. కానీ భాజపా అలా కాదు. అది ఎన్నికలప్పుడే రాజకీయాలు అని అంటున్నా ఆచరణలో చూస్తే చెప్పేదానికి, చేసేదానికి ఎంత తేడా ఉందో తెలిసిందే. కాంగ్రెస్ లౌకిక విధానాలతో ప్రాంతాలకు, మతాలకు, కులాలకు అతీతంగా అభివృద్ధి గురించి ఆలోచిస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో చేసిన అభివృద్ధే ఇందుకు నిదర్శనం.

**ఐదు గ్యారంటీలను అమలు చేశాం**

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఐదు గ్యారంటీలను అమలు చేశాం. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.పదిలక్షలకు ఆరోగ్య బీమా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్‌తో పాటు గృహజ్యోతి అమలుకు శ్రీకారం చుట్టాం. అర్హులైన వారందరికీ తెల్లరేషన్ కార్డుల జారీకి నిర్ణయం తీసుకొన్నాం. పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను ప్రక్షాళన చేసి ఉద్యోగాల భర్తీ ప్రారంభించాం. మూడునెలల్లో 28వేలకు పైగా ఉద్యోగాలు నింపాం. మొత్తం 563 పోస్టులతో గ్రూపు-1 నోటిఫికేషన్, 11,062 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్, వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు ప్రారంభించాం. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యం, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. పంటల భీమా పథకాన్ని ప్రారంభించడంతోపాటు పెట్టుబడి సాయంతో సహా అనేక చర్యలు తీసుకొంటాం. ధరణి పోర్టల్ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్ని సంకుచిత విధానాలుభాజపా తిరిగి అధికారంలోకి వస్తే దేశానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలకు మరింత అన్యాయం జరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన చేస్తే నియోజకవర్గాల సంఖ్య తగ్గి లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. అలాగే జనాభా ఆధారంగా నిధుల కేటాయింపు వల్ల కూడా నష్టం జరుగుతుంది.



2 లో

# మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

ఇక్కడ గెలిచేది సీఎం అభ్యర్థిగా గుర్తించాలి

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మల్కాజిగిరిపై సీఎం రేవంత్ సమీక్ష


# ఆ ఐదు స్థానాలపై బీఆర్ఎస్‌లో ఉత్కంఠ

**ఎటూ తేల్చుకోలేక పోతున్న గులాబీబాస్**

**పోటీ చేసేందుకు పలువురు విముఖత**

**అభ్యర్థుల ఎంపికపై తర్జనభర్జన**

**మెదక్ స్థానంలో హరీష్‌ను నిలిపే ఆలోచన**



2 లో



2 లో

## ఇసిల నియామకంలో స్టే ఇవ్వలేం

జోక్యం చేసుకుంటే గందరగోళానికి దారితీయగలదు

కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పని భావించలేం

సుప్రీంకోర్టులో పిటిషన్లపై విచారణలో ధర్మాసనం వెల్లడి



2 లో

## మాజీ డీఎస్‌పీ ప్రణీత్ రావుకు చుక్కెదురు

కస్టడీ పిటిషన్‌ను సవాల్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

కిందికోర్టు తీర్పును సమర్థించిన న్యాయమూర్తి



## తవ్వేకొద్దీ బయటపడుతున్న శివబాలకృష్ణ లీలలు

హైదరాబాద్: తవ్వేకొద్దీ హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమాలు బయటపడుతున్నాయి. ఈ కేసులో టీడీఆర్ స్కాం వెలుగులోకి వచ్చింది. కృష్ణకుమార్, శివ బాలకృష్ణ అక్రమాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. కృష్ణకుమార్‌ని ప్రభుత్వం ఇప్పటికే సస్పెండ్ చేసింది. హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పని చేసిన బీవీ కృష్ణ కుమార్.. బడా బిల్డర్లతో కుమ్మక్కై టీడీఆర్ ద్వారా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలు నష్టం చేశారు. బిల్డర్లకు లబ్ధి చేకూర్చే విధంగా ఫైల్స్ క్లియర్ చేసినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. కృష్ణ కుమార్ చర్య వల్ల ప్రభుత్వానికి 3800 కోట్ల నష్టం జరిగిందని ఏసీబీ అంచనా వేస్తోంది. మరో ఇద్దరు హెచ్ఎండీఏ ప్లానింగ్ అధికారుల పాత్రపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

బడా బిల్డర్ల ప్రాజెక్ట్‌ల ప్లానింగ్‌లో టీడీఆర్ విలువ తగ్గించి, తక్కువ ఫీజులు కట్టించి ప్రభుత్వానికి నష్టం చేశారు. శివ బాలకృష్ణపై ఏసీబీ కేసు నమోదు కాగానే కృష్ణకుమార్ అమెరికాకు వెళ్లిపోగా, అక్కడ నుంచి హైదరాబాద్‌కు రప్పించే ప్రయత్నాలను ఏసీబీ అధికారులు చేస్తున్నారు. శివబాలకృష్ణ, కృష్ణ కుమార్, మరో ఇద్దరు ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు సిండికేట్‌పై ఏసీబీ దృష్టి పెట్టింది.

# కాంగ్రెస్ ఖాతాల స్తంభన ఓ కుట్ర



**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్‌ను ఇబ్బందులకు గురి చేసేందుకు కాంగ్రెస్ ఖాతాలను స్తంభింప చేశారని, ప్రధాని మోడీ ఇందుకు బాధ్యుడని కాంగ్రెస్ తీవ్రంగా
ఆరోపించింది. ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌పై కక్షసాధింపు చర్యలకు దిగారని మండిపడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, జైరామ్ రమేశ్ తదితరులు గురువారం ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్, ఎన్నికల బాండ్ల అంశాలపై నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ పార్టీని దెబ్బతీసేందుకే ప్రధాని మోదీ తీవ్ర చర్యలకు పాల్పడుతున్నారని వీరంతా మండిపడ్డారు. ఎన్నికల వేళ డబ్బులేకపోవడంతో ప్రచారం చేసులేకపోతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి పాల్పడుతున్న నేరపూరిత చర్య ఇదని మండిపడ్డారు. మా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఈ రోజుల్లో అకౌంట్లు పనిచేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో మీకు తెలుసు. ఎలాంటి లావాదేవీలు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్ చేయడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గేతో పాటు.. ఆ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు మండిపడ్డారు. బీజేపీ అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తమ పార్టీకే కాదని మొత్తం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. ప్రజలు పార్టీ కోసం ఇచ్చిన విరాళాలను వాడుకోకుండా చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎన్నికల వేళ ప్రచారం కోసం ప్రకటనలు ఇవ్వలేకపోతున్నాం. మా నేతలను ఎక్కడికీ పంపించలేకపోతున్నాం. విమాన ప్రయాణాలు పక్కనబెట్టండి.. కనీసం రైలు టికెట్లు కొనడానికీ మా వద్ద డబ్బుల్లేవ్ అని రాహుల్ గాంధీ తెలిపారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ ఖాతాలను ఫ్రీజ్ చేయడం కాదని, భారత ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడమని ఆయన దుయ్యబట్టారు. ఈ రోజు దేశంలో ప్రజాస్వామ్యం అనేదే లేకుండా పోయింది. అది అబద్ధంగా మారింది. దేశంలో 20శాతం ఓటర్లు మాకు మద్దతుగా ఉన్నారు. కానీ మేం రెండు రూపాయలు కూడా చెల్లించలేక పోతున్నాం. ఎన్నికల్లో పోరాడకుండా మా సామర్థ్యాన్ని అడ్డుకుంటున్నారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కేంద్రంపై రాహుల్ మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్యమే లేదన్నారు. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తే ఎన్నికల్లో ఎలా పోటీ చేయగలమన్నారు. ఎవరిదైనా బ్యాక్ అకౌంట్ మూసివేసినా, ఏటీఎం కార్డు పని చేయకుండా చేస్తే జీవించగలరా.. ప్రస్తుతం తాము ఎన్నికల్లో ప్రచారం చేసే పరిస్థితి లేకుండా బీజేపీ కుట్రకు పాల్పడిందన్నారు. ఎన్నికలకు 2 నెలల ముందు ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌ను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకూడదనేదే బీజేపీ ఉద్దేశంగా కనిపిస్తోందని రాహుల్ ఆరోపించారు.
అంతకుముందు సోనియా గాంధీ మాట్లాడుతూ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. మా బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను బలవంతంగా లాగేసుకుంటున్నారు. కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రధాని మోదీ వ్యవస్థీకృతంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఓవైపు ఎన్నికల బాండ్ల వ్యవహారం.. మరోవైపు దేశంలోని ప్రధాన ప్రతిపక్షం ఆర్థిక లావాదేవీలపై దాడి జరుగుతోంది. ఇన్ని సవాళ్ల నడుమ ఎన్నికల్లో మేం సమర్థంగా ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం అని ఆమె అన్నారు. ఎలక్టోరల్ బాండ్లు తీవ్రమైన అంశమని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలిపారు. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, కాంగ్రెస్‌ను ఆర్థికంగా ఇబ్బందులు పెట్టే కుట్ర కనిపిస్తోందని, కేంద్రం తీరు సరిగా లేదని, కాంగ్రెస్ అకౌంట్లపై ఫ్రీజ్ తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను బలహీనపరిచే కుట్ర చేస్తున్నారని, కాంగ్రెస్ అకౌంట్లపై ముప్పేట దాడి జరుగుతోందని, అకౌంట్లను ఫ్రీజ్ చేయడమనేది దారుణమైన విషయమని సోనియా గాంధీ మండిపడ్డారు. నిధుల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్లపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాలని కాంగ్రెస్
అగ్రనేత సోనియా గాంధీ డిమాండ్ చేశారు. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా బీజేపీకి 56 శాతం నిధులు వస్తే.. కాంగ్రెస్‌కు 11 శాతం ఫండ్స్ మాత్రమే వచ్చాయన్నారు. బీజేపీకి రూ.వేల కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఎలా వచ్చాయని ఆమె ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్‌ల వల్ల బీజేపీ భారీగా లాభపడిందన్నారు. తాము ప్రజల నుంచి న్యాయబద్ధంగా సేకరించిన నిధులను ఐటీ ఫ్రీజ్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అధికార పక్షం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని.. దేశ చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదని మండిపడ్డారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో జరుగుతున్న పరిణామాలు అసాధారణమైనవని, అప్రజాస్వామికమైనవని సోనియా అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ను అర్థికంగా ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతుందని సోనియా గాంధీ ఆరోపించారు. కేంద్రం తీరు సరిగ్గా లేదన్న ఆమె.. కాంగ్రెస్ అకౌంట్లపై ఫ్రీజ్ తొలిగించాలని కోరారు. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీని బలహిన పరిచే కుట్రలు జరుగుతున్నా యని చెప్పారు. నిధుల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగాలంటే తమ బ్యాంకు ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయాలని కోరారు. అభ్యర్థులకు ఇచ్చేందుకు డబ్బు లేదన్నారు. సమయం చూసి కాంగ్రెస్‌ను దెబ్బ తీస్తున్నారని దుయ్యబట్టారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఎవరు లబ్ది పొందారో దేశం మొత్తానికి తెలుసని మరో కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు. ఇది అత్యంత తీవ్రమైన అంశమని అన్నారు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసిందని ఆరోపించారు. అధికార పార్టీ వైఖరి ఎంతో ప్రమాదకరమని అన్నారు. బీజేపీ వేల కోట్ల రూపాయిలు విరాళాలుగా తీసుకుని.. కేవలం మా బ్యాంకు ఖాతాలను ఎందుకు స్తంభింపజేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలు, ఆదర్శాలకు భారత్ పేరు గాంచిందని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన విషయం ప్రజలకు తెలిసిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిష్పక్షపాతమైన ఎన్నికలు తప్పనిసరన్నారు. ప్రతి ఒక్కరికీ సమానమైన అవకాశాలు ఉండాలని ఖర్గే పేర్కొన్నారు. మోదీ పాలనలో భారతదేశ ప్రతిష్ట దిగజారు తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖాతాలను సీజ్ చేయడం ద్వారా ఎన్నికల్లో పోటీకి సంబంధించి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింద న్నారు. ఓ రాజకీయ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డంకులు సృష్టించడం సరికాదని.. ఖర్గే అభిప్రాయపడ్డారు. ఎక్కడ చూసినా బీజేపీ ప్రకటనలే కనిపిస్తు న్నాయి. తమ బ్యాంకు ఖాతాలు స్తంభిపజేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అజయ్ మాకెన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తాము ప్రచారం చేసుకోలేకపోతున్నామన్నారు. పోస్టర్లు వేయించడానికి వీలులేని పరిస్థితులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కల్పిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే ప్రజలకు తమకు మద్దతు ఇవ్వాలని అజయ్ మాకెన్ కోరారు. బీజేపీతో సహా ఏ రాజకీయ పార్టీ ఆదాయపు పన్ను చెల్లించనప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 బ్యాంకు ఖాతాలను ఎందుకు ఫ్రీజ్ చేశారని ఆయన ప్రశ్నించారు.

## ఇసిల నియామకంలో స్టే ఇవ్వలేం

**న్యూఢిల్లీ,:** ఇసిల నియామకం అంశంలో స్టే ఇచ్చేందుకు సుప్రీం నిరాకరించింది. ఇద్దరు కమిషనర్ల నియామకాన్ని కూడా తప్పుపట్టలేమని తేల్చి చెప్పింది. లోక్‌సభ ఎన్నికల ముందు ఈసీల నియామకం అంశం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం నూతనంగా తీసుకొచ్చిన చట్టాన్ని నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. చట్టంపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ దశలో నిలిపివేస్తే అది తీవ్ర గందరగోళానికి దారితీస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఇటీవల ఈసీలుగా బాధ్యతలు చేపట్టిన మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్ నియామకాలను కూడా ధర్మాసనం ప్రస్తావించింది. కొత్తగా నియమితులైన వారిపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంది. ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థ. అది పాలనాయంత్రాంగం కింద పనిచేస్తుందని చెప్పకూడదు. ఈసీల నియామకాల కోసం కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పు అని భావించలేం. ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఈ సమయంలో సమతుల్యత పాటించాల్సిన అవసరం చాలా ముఖ్యం' అని ధర్మాసనం అభిప్రాయపడింది. 2023 చట్టం రూపొందించక ముందు ఎన్నికల కమిషనర్ల నియామక తాత్కాలిక కమిటీలో ప్రధాని, సీజేఐ, లోక్‌సభలో విపక్షనేత సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టం ప్రకారం ఏర్పడిన కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పించారు. దీన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై కేంద్రం బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. కొత్త చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది. ఇదిలావుంటే భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా లేని ఎంపిక కమిటీ నూతన ఎన్నికల కమిషనర్లను నియమించడం సరైందేనని సుప్రీంకోర్టులో కేంద్రం పేర్కొంది. 2023 చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది. ఈ మేరకు న్యాయమంత్రిత్వశాఖ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రమాణపత్రం దాఖలు చేసింది. 2023 చట్టం ప్రకారం హడావుడిగా కొత్త ఈసీల నియామకం జరిపామన్నది సరికాదని స్పష్టం చేసింది. ఎంపిక కమిటీలో న్యాయసభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం లేదా ఏ సంస్థ అయినా స్వతంత్రంగా ఉంటుందనుకోవడం అపోహ అని పేర్కొంది. పూర్తి కార్యనిర్వాహక విచక్షణతో నియమించిన కాలంలోనూ ఎన్నికల కమిషనర్లు తటస్థంగా, ప్రభావవంతంగా విధులు నిర్వహించారు. ఒక ఉన్నత రాజ్యాంగ కార్యాలయంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాజ్యాంగంలోనే రక్షణ ఉంది. అది ఆయనకు నిష్పక్షపాతంగా పనిచేసే అవకాశం కల్పిస్తుందని తెలిపింది. ఈసీల ఎంపిక కోసం రూపొందించిన జాబితాను విపక్షాలతో పంచుకోలేదన్న ఆరోపణలను మంత్రిత్వశాఖ కొట్టిపారేసింది. ఈ నెల 13నే లోక్‌సభలో విపక్షనేత అధీర్ రంజన్ చౌధరీకి జాబితాను సమర్పించామని తెలిపింది. అందులోంచే నూతన ఈసీల నియామకం జరిగిందన్న విషయాన్ని గుర్తుచేసింది. ఇటీవల ఖాళీ అయిన రెండు ఎన్నికల కమిషనర్ల పదవులను మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్‌లతో 2023 చట్టం ప్రకారం ఏర్పాటైన కొత్త కమిటీ భర్తీ చేసిన సంగతి తెలిసిందే. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలు - సర్వీసు షరతులు, పదవీకాలం చట్టం-2023ను ప్రజాస్వామ్యయుతంగా, అందరినీ కలుపుకొనేలా రూపొందించామని పిటిషన్‌లో న్యాయమంత్రిత్వశాఖ తెలిపింది. 2023 చట్టం రూపొందకముందు ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో ప్రధాని, సీజేఐ, విపక్షనేత సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టం ప్రకారం ఏర్పడిన కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పించారు. దీన్ని కాంగ్రెస్ నేత జయా ఠాకుర్‌తో పాటు ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఏడీఆర్) సవాల్ చేసింది.

## మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుకు చుక్కెదురు

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. పోలీస్ కస్టడీని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు
కొట్టి వేసింది. నాంపల్లి కోర్టు కస్టడీని సవాలు చేస్తూ హైకోర్టులో ప్రణీత్ పిటిషన్ దాఖలు చేయగా.. బుధవారం విచారణ జరిగింది. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా గురువారం ప్రణీత్ రావు పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు హైకోర్టు తీర్పును వెల్లడించింది. ప్రణీత్ రావ్ కస్టడీపై కింది కోర్టు ఇచ్చిన కస్టడీ అనుమతి సరైందే అని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. కాగా.. వాస్తవాంశాలను పరిగణలోకి తీసుకోకుండా కింది కోర్టు కస్టడీకి ఇచ్చిందంటూ ప్రణీత్ రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. కస్టడీ సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించలేదని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో నిద్రపోవడానికి సరైన సౌకర్యాలు కూడా లేవని వెల్లడించారు. విచారణ పూర్తయిన తర్వాత తిరిగి జైలుకు తరలించేలా ఆదేశాలివ్వాలన్నారు. దర్యాప్తులోని అంశాలను మీడియాకు లీక్ చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎందుకు లీక్ చేస్తున్నారో అందరికీ తెలిసిన విషయమేనని ప్రణీత్ రావు అన్నారు. రహస్యం పేరుతో బంజారాహిల్స్ పీఎస్‌లో విచారిస్తున్నారని.. బంధువులు, న్యాయవాదిని కూడా అనుమతించడం లేదని తెలిపారు. ఇంటరాగేషన్‌లో ఏఎస్పీ డి.రమేశ్ పాల్గొనకుండా నియంత్రించాలని కోరారు. ఇప్పటికే సమాచారం అందించినందున కస్టడీ రద్దు చేయాలని ప్రణీత్ రావు పిటిషన్‌లో పేర్కొన్నారు. తొలుత పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదించారు. అనంతరం పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. కింది కోర్టు ఉత్తర్వుల ప్రకారమే కస్టడీలో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పోలీసు స్టేషన్‌లో కనీస వసతులు ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదుదారు అయిన ఏసీపీ రమేశ్‌కు దర్యాప్తులో పాత్ర లేదన్నారు. పిటిషనర్.. తన న్యాయవాది ఫోన్ ద్వారా తల్లిదండ్రులతోనూ మాట్లాడుతున్నారన్నారు. ఏడురోజుల కస్టడీలో 4 రోజులు పూర్తయ్యాయని.. మిగిలింది మూడు రోజులేనని, ఉపయోగంలేని ఈ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రణీత్‌రావు పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## అధిష్టానం ఆదేశిస్తే కడపలో పోటీ

**విజయవాడ:** కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే..కడప నుంచి పోటీ చేస్తానని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. అధిష్టానం ఆదేశాలను ఎవరైనా పాటించాల్సిందేనని అన్నారు.విజయవాడ 'ఆంధ్రరత్న' భవన్‌లో కడప నేతలతో ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల సమావేశం ముగిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే కడప నుంచైనా పోటీకి సిద్ధమని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే తనతో సహా ఏ స్థాయిలో ఉన్న నేత అయినా పోటీకైనా, త్యాగానికైనా సిద్దంగా ఉండాలని ఆమె సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా తాను పోటీకి సిద్ధంగా ఉన్నానని ఆమె పేర్కొన్నారు. నేనే కాదు.. రఘువీరారెడ్డి, ఇతర ముఖ్య నేతలు అయినా అధిష్ఠానం ఆదేశాలు పాటిస్తారని అన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా మా గురించి ఎందుకు ఆలోచన చేస్తున్నారని షర్మిల ప్రశ్నించారు. మిమ్మల్ని ఇంటికి పంపడానికి ప్రజలంతా సిద్దంగా ఉన్నారు సజ్జల గారూ. పోలవరం, రాజధాని, స్టీల్ ఫ్యాక్టరీ, హోదా కోసం కాంగ్రెస్ మాత్రమే పోరాటం చేస్తోందని అన్నారు.అవినాశ్ రెడ్డి అనే వ్యక్తి జగన్‌కు సొంత కజిన్. వైసీపీలో ఉండి కూడా అవినాశ్ రెడ్డి కడప స్టీల్ ఫ్యాక్టరీ కోసం ఎందుకు పోరాటం చేయలేదని ప్రశ్నించారు. దీనిపై సజ్జల, జగనన్న కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. అధిష్ఠానం ఆమోదం తర్వాత త్వరలోనే కాంగ్రెస్ జాబితా ఉంటుందని వైఎస్ షర్మిల చెప్పారు. వచ్చే ఎన్నికలలో పోటీ చేస్తామంటూ 1500 దరఖాస్తులు అందాయని ఈ సందర్భంగా షర్మిల తెలిపారు. అన్నింటినీ పరిశీలిస్తున్నామని, సర్వేలు జరుగుతున్నాయని, అభ్యర్థులు ఇంకా ఫైనల్ కాలేదని ఆమె అన్నారు.

## ఇడి విచారణకు సిద్ధంగా కేజ్రీవాల్



**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో విచారనకు హాజరయ్యేందుకు సిద్దంగా ఉన్నా..చెప్పాపెట్టకుండా అరెస్ట్ చేస్తున్నారని ఆప్ మండిపడింది. ఈ మేరకు ఆప్ మంత్రి అతిషి మర్లీనా స్పందించారు. 9వ సారి సమన్లు అందుకున్నప్పటికి.. సీఎం కేజ్రీవాల్ విచారణకు హాజరుకాలేదు. షెడ్యూల్ ప్రకారం గురువారం కేజ్రీవాల్ ను విచారణకు రమ్మని ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఈడీ విచారణ అంశంపై ఆప్ మంత్రి అతిషి మర్లీనా స్పందించారు. ఈడీ విచారణకు కేజ్రీవాల్ సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అయితే తనను అరెస్ట్ చేయవద్దని ఆదేశాలివ్వాలంటూ కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని అతిషి తెలిపారు. విచారణకు వెళ్తే ఈడీ అరెస్ట్ చేసే అవకాశం ఉందన్న అనుమానం తమకు ఉందన్నారు. సీఎం కేజ్రీవాల్ ఈడీ దర్యాప్తునకు హాజరవ్వాలను కుంటున్నారని, కాని ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను తాము స్వతంత్ర సంస్థగా చూడటం లేదని, అది బీజేపీకి రాజకీయ సాధనంగా పని చేస్తుందని అతిషి ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలని ఈడీ భావిస్తోందని, ఒకవేళ ఆయన దర్యాప్తు సంస్థ విచారించాలనుకుంటే.. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయబోమని కోర్టులో ఈడీ చెప్పాలని మంత్రి అతిషి పేర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో 9 సార్లు నోటిసులు జారీ చేసినా కేజ్రీవాల్ హాజరుకాకపోవడంతో.. ఇక ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. కోర్టు తీర్పు ఆధారంగా కేజ్రీవాల్ ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్ల తెలుస్తోంది.

## మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

**హైదరాబాద్:** మల్కాజిగిరి, కొడంగల్ తనకు రెండు కళ్లలాంటివని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానం ఎన్నిక అభ్యర్థిది కాదని, ముఖ్యమంత్రిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని నేతలతో సీఎం సమావేశం నిర్వహించారు. తనను సీఎంను చేసింది మల్కాజ్ గిరి గెలుపేనని గుర్తు చేశారు. అప్పుడు నాయకులు అమ్ముడు పోయినా కార్యకర్తలను భుజాలపై ఎత్తుకొని మోసి తనను ఢిల్లీకి పంపించారని అన్నారు. 2,964 బూత్ లలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని చెప్పారు. కేసీఆర్ పతనం 2019లో మల్కాజ్ గిరి నుంచే మొదలైందని అన్నారు. మల్కాజిగిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి స్కైవేల నిర్మాణానికి శంకుస్థాపన చేసునుకున్నామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తాను సీఎంగా ఉన్నానంటే.. ఆ గొప్పతనం మల్కాజిగిరి కార్యకర్తలదేనన్నారు. ఆనాడు కొందరు నాయకులు అమ్ముడుపోయినా.. కార్యకర్తలు భుజాలపై మోసి గెలిపించి తనను దిల్లీకి పంపించారని గుర్తు చేశారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజిగిరి. నాటి గెలుపు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసింది. కేసీఆర్ పతనం 2019లో మల్కాజిగిరి నుంచే మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. 100 రోజులు పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేశాం. మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానిది. మల్కాజిగిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి స్కైవేల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. మెట్రో, ఎంఎంటీఎస్ రావాలన్నా.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కావాలన్నా.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా తుపాను వచ్చినట్లు గెలిచినా.. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఆశించిన స్థాయిలో రాలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 4 స్థానాలు గెలిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేది. అందుకే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఇప్పుడు కాంగ్రెస్ జెండా ఎగరాలి. అప్పుడే మన ప్రాంతం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ గెలవాలి. హోలీ పండగలోగా అధిష్ఠానం అభ్యర్థులను ప్రకటిస్తుంది. కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత నాది. ఉదయం 7 గంటలకే నాయకులు బస్తీ బాట పట్టాల్సిందే. ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించుకోవాలి. మల్కాజిగిరి క్యాంపెయిన్ మోడల్ రాష్ట్రమంతా అనుసరించేలా చేయాలి. ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నిక అభ్యర్థిది కాదు..ముఖ్యమంత్రిది. నా బలం.. నా బలగం మీరే' అని సీఎం వివరించారు. ఈ ఎన్నికల్లో కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదని సీఎం భరోసా ఇచ్చారు. నాయకులు కార్యకర్తలే తన బలం.. బలగమని, ప్రణాళికా బద్ధంగా ప్రచారం చేయాలని సూచించారు. ఉదయం 7 గంటలకే బస్తీ బాట పట్టాలని అన్నారు. మల్కాజ్ గిరి మోడల్ క్యాంపెయిన్ రాష్ట్రమంతా అనుసరించేలా ఉండాలన్నారు.

## ఆ ఐదు స్థానాలపై బిఆర్ఎస్‌లో ఉత్కంఠ

**హైదరాబాద్:** ఐదు లోక్‌సభ స్థానాల్లో అబ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. కొందరు పోటీకి విముఖంగా ఉండడం కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి. ఈ క్రమంలో అబ్యర్థుల ఎంపిక ఆలస్యం అవుతోందని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీ నేతలు తమ అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బిజీబిజీగా ఉన్నాయి. మొత్తం 17 పార్లమెంటు స్థానాలకు గానూ పలువురు అభ్యర్థులను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించేశాయి. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ ఎంపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించేశారు. అయితే ఐదు స్థానాలపై మాత్రం పార్టీలో సస్పెన్స్ కొనసాగుతోంది. మెదక్, సికింద్రాబాద్, నల్గొండ, భువనగిరి, హైదరాబాద్ స్థానాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ ఐదు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన కాస్త ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెండింగ్ స్థానాల అభ్యర్థుల కోసం కేసీఆర్ మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. నేతలు పార్టీ వీడుతుండటం కూడా అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారింది. నల్గొండ నుంచి బరిలో నిలపడానికి మొదట గుత్తా అమిత్ రెడ్డి పేరును బీఆర్ఎస్ పరిశీలించింది. అయితే అమిత్ రెడ్డి పోటీకి నో చెప్పడంతో సైదిరెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సైదిరెడ్డి కూడా బీజేపీలోకి వెళ్లడంతో అభ్యర్థి కోసం గులాబీ బాస్ తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నల్గొండ కోసం కంచర్ల కృష్ణారెడ్డి, కడారు అంజయ్య యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే బీఆర్ఎస్ అధినేత మాత్రం కంచర్ల కృష్ణారెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇక భువనగిరిలోనూ అదే పరిస్థితి నెలకొంది. భువనగిరి కోసం మొదట మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పేరును బీఆర్ఎస్ పార్టీ దాదాపు ఖరారు చేసింది. కానీ పైళ్ల కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో మరో అభ్యర్థి కోసం కేసీఆర్ కసరత్తు మొదలుపెట్టారు. ప్రస్తుతం భువనగిరి రేసులో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, దూదిమెట్ల బాలరాజు ఉన్నారు. మరోవైపు సికింద్రాబాద్ నుంచి తలసాని సాయికిరణ్ పోటీకి విముఖత చూపడంతో మరో అభ్యర్థి కోసం బీఆర్ఎస్ అన్వేషణ సాగిస్తోంది. సికింద్రాబాద్ కోసం పద్మారావు, దాసోజు శ్రావణ్, రావుల శ్రీధర్ రెడ్డి పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి పద్మారావును పోటీ చేసేందుకు బీఆర్ఎస్ ఒప్పిస్తున్నట్లు తెలుస్తోంది.
అటు మెదక్ అభ్యర్థిపైనా పీటముడి ఇంకా వీడలేదు. మొదట మెదక్ కోసం ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి పేరును కేసీఆర్ పరిశీలించారని సమాచారం. వెంకట్రామిరెడ్డి పోటీకి ఆసక్తి చూపకపోవడంతో ఒంటేరు ప్రతాపరెడ్డి పేరును అధినేత పరిశీలిస్తున్నారు. అలాగే హైదరాబాదులో పోటీ నామ మాత్రమే కావడంతో మిగిలిన నాలుగు స్థానాలపైనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఒకటి, రెండు రోజుల్లోనే పెండింగ్ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో ఉండే అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచార వ్యూహాలను రచిస్తున్నారు. ఇకపోతే మెదక్ సీటు మరింత ప్రతిష్టాత్మకం కావడంతో ఇక్కడ గెలుపు గుర్రాలపై ఆలోచన చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమానికి ముందు నుంచి బీఆర్ఎస్ ఇక్కడ గెలుస్తోంది. 2009లో టీఆర్ఎస్ నుంచి విజయశాంతి, 2014లో
మెదక్ నుంచి కేసీఆర్ ఎంపీగా గెలిచారు. మళ్లీ ఉప ఎన్నికల్లోనూ, 2019 లోక్ సభ ఎన్నికల్లోనూ కొత్త ప్రభాకర్ రెడ్డి టీఆర్ఎస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజక
వర్గాల్లో ఒక్క మెదక్ తప్ప..మిగతా ఆరు స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇక్కడ సిద్దిపేట నుంచి హరీశ్ రావు, గజ్వేల్ నుంచి కేసీఆర్, దుబ్బాక నుంచి కొత్త ప్రభాకర్ రెడ్డి భారీ మెజారిటీతో గెలిచారు.
మెదక్ లో బీఆర్ఎస్ కు మంచి పట్టు ఉన్నా ప్రస్తుతం లోక్ సభకు పోటీ చేసేందుకు ఎవర్ని బరిలోకి దింపాలనేదానిపై అధిష్టానం తర్జనభర్జనలో పడింది. లోక్‌సభ ఎన్నికల్లో ఖచ్చితంగా గెలుస్తామనుకుంటున్న స్థానాన్ని ఎలాగైనా వదులుకోవద్దని బీఆర్ఎస్ చూస్తోంది. కాంగ్రెస్ నుంచి నీలం మధు పేరు వినిపిస్తోంది. బీజేపీ నుంచి రఘునందన్ రావు బరిలో దిగారు. ఇక బీఆర్ఎస్ నుంచి మెదక్ లోక్‌సభకు తాజాగా
హరీశ్ రావు లేదా కేసీఆర్ పోటీచేయాలని బీఆర్ఎస్ నేతలు కోరుతున్నారు. కీలక నేతలు బరిలో దిగితే ఖచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే హరీశ్ రావు మెదక్ నుంచి పోటీ చేస్తే పార్టీ క్యాడర్ లో జోష్ వస్తుందంటున్నారు. కేసీఆర్ కూడా హరీశ్ ను పోటీ చేసేందుకు మొగ్గుచూపిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఎవ్వరూ కాదంటే మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేరును కూడా పరిశీలిస్తున్నారు. మొత్తంగా మిగిలిన ఐదు స్థానాల్లో గులాబీ బాస్ ఎవర్ని బరిలోకి దింపుతారో అన్న ఉత్కంఠ కలుగుతోంది. ఇక నాగర్‌కర్నూలులో మాత్రం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోటీ ఖాయమని అంటున్నారు.

# హస్తం ఖాతాలో...ఆర్మూర్ మున్సిపాలిటీ.

**నూతన చైర్పర్సన్ గా ఎన్నికైన అయ్యప్ప లావణ్య శ్రీనివాస్. సన్మానించిన కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి.**



**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, మార్చి 21:**

గత ఎన్నో రోజులుగా ఉత్కంఠ రేపిన ఆర్మూర్ మున్సిపల్ అనుకున్నట్టే హస్తం ఖాతాలో చేరింది. గతంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్పర్సన్ గా ఉన్న పండిత్ వినీతపై సొంత పార్టీకి చెందిన బీఆర్ ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసపు సెగ పెట్టడంతో బల పరీక్షలో నెగ్గారు. దీంతో కొంతకాలం ఇంచార్జి చైర్మన్ గా వైస్ చైర్మన్ షేక్ మున్ను కొనసాగారు. చైర్మన్ ఎన్నిక కోసం మున్సిపల్ శాఖ ఉన్న తాధికారుల నుండి గ్రీన్ సిగ్నల్ రావడంతో గురు వారం మున్సిపల్ ఛాంబర్ లో నూతన అధ్యక్ష ఎన్నిక జరిపారు. కోరం సభ్యులు హాజరు కావడంతో నూతన చైర్పర్సన్ గా అయ్యప్ప లావణ్య శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికకు ముందు చైర్పర్సన్ రేసులో ఉన్న అయ్యప్ప లావణ్య, ఖాందేశ్ సంగీతతో చర్చించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమెను నూతన చైర్పర్సన్ గా ఎన్నుకున్నారు. ఆర్మూర్ మున్సిపల్లో మొత్తం 36 మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉన్నారు. కాగా, సమావేశానికి సరిపోను కోరం సభ్యులు హాజరయ్యారు. వీరి మద్దతుతో లావణ్య చైర్పర్సన్ గా ఎన్నికయ్యారు. అయితే మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, బీజేపీ కౌన్సిలర్లు, మరికొందరు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాంపునకు వెళ్లిన కాంగ్రెస్ కౌన్సిలర్లు గురువారం ఉదయం పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్ చార్జీ వినయ్ రెడ్డి కౌన్సిలర్లను సన్మానించారు.

## సాఫ్ట్ బాల్ పోటీలకు "సత్యశోధక్" విద్యార్థి.



**వేగుచుక్క న్యూస్, సిరికొండ, మార్చి 21:**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని అలైర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 మరియు 24 తేదీలలో జరిగే 8వ రాష్ట్రస్తాయి అండర్ -14, సాఫ్ట్ బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పి.వర్షిత్ ఈ నెల 11న ఆర్మూర్ లో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్తాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భగా గురువారం పాఠశాలలో వర్షిత్ ను ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య ప్రత్యేక జ్ఞాపికను అందించి అభినందించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకొని రాష్ట్రస్తాయి పోటీలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలి.

## - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ.



**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, మార్చి 21:**

లోక సభ ఎన్నికలు యజ్ఞంలా భావించి పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ లు కోరారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలలో వ్యయ నియంత్రణ ప్రధాన అంశమని, ప్రతి ఖర్చును లెక్కించవలసి ఉంటుందని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి గుర్తించిన వారిపై కేసులు నమోదు చేసి వాటిని స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఇందుకు నియమించిన ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్, , వీడియో వీనింగ్ బృందాలు, సెక్టోరల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. ఆబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బందితో సమీకృత చెక్ పోస్తులు ఏర్పాటు చేసి అక్రమ రవాణాపై కేసులు నమోదు చేయాలని సూచించారు. చెక్ పోస్ట్ ల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, 10 లక్షలు పైగా డబ్బు పట్టుపబడిన సందర్భంలో ఆదాయ శాఖ అధికారులకు సమాచారమందించాలన్నారు. గిఫ్ట్ వస్తువుల రవాణాపై వాణిజ్య పన్నుల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అనుమానాస్పద ఆన్ లైన్ బ్యాంకు లావాదేవీలపై ప్రతి రోజు నివేదిక అందించాలని, అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు నిర్వహించాలని ఆబ్కారీ అధికారులకు సూచించారు. అదేవిధంగా బస్సు ప్రయాణంలో అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే అధికారులకు సమాచార మందించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కు సూచించారు. ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వెలువడిన నాటి నుండి విస్తృత తనిఖీలు చేస్తూ గత మూడు రోజులలో 7.6 లక్షలు, నేడు 4.50 లక్షల నగదు తో పాటు 986 లీటర్ల ఐ ఏం. ఎఫ్.ఎల్ మద్యాన్ని పట్టుకున్నామని అన్నారు. గత శాసన సభ ఎన్నికలలో మాదిరే ఈ ఎన్నికలల్లో అధికారులు సమిష్టిగా కృషిచేస్తూ అక్రమ డబ్బు,మద్యం,కానుకలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.ఎఫ్.ఓ. నిఖిత, ఆర్.టి.ఓ. శ్రీనివాస్ రెడ్డి, ఆర్.డి.ఓ. లు, రమేష్ రాథోడ్, రంగనాథ్, మన్నే ప్రభాకర్, బావయ్య, భార్గవ్ సుధీర్, ఇందిర తదితర అధికారులు, తహాసీల్దార్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన బిఆర్ఎస్ నాయకులు.




**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, పాల్వంచ, మార్చి 21**

మండల కేంద్రానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీషబ్బీర్, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లె రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు చేరారు. సర్పంచ్ సునీత నారాయణ గౌడ్, టిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ మాజీ డైరెక్టర్ కె రాజు, వార్డు సభ్యులు అనిత సురేందర్, కోఆప్షన్ మెంబర్ హరీష్, మాజీ ఎంపీటీసీ జై చంద్రయ్య, యూత్ సెక్రెటరీ కావటి సంతోష్, యాదవ సంఘం అధ్యక్షుడు సిహెచ్ బాలయ్య, తోట కాశీనాథం, బాల్ లింగం, మైనార్టీ సోదరులు జాకీర్ హుస్సేన్, వివిధ కుల సంఘాల పెద్దలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# ఐటీ హబ్ ను సందర్శించిన ఎమ్మెల్యే ధన్ పాల్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 21**



నగరంలోని ఐటీ హబ్ ను అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మీడియా తో మాట్లాడుతు, గత ప్రభుత్వం మాజీ ఐటీ మంత్రివర్యులు కేటీఆర్ ప్రారంభించిన నిజామాబాదు ఐటి హబ్, కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించి, ఇక్కడ ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో నిర్మించిన గత పాలకులు దృష్టి పెట్టకపోవడంతో కంపెనీలను తీసుకురావడంలో విఫలం అయ్యారని అన్నారు. 671 సీటింగ్ కెపాసిటీ ఉన్న ఈ ఐటీ హబ్ లో 313 మాత్రమే పూర్తి అయినవి అని, ఇంకా 368 ఖాళీలు ఉన్నాయని తెలిపారు, రాబోయే రోజుల్లో తప్పకుండ ఐటి హబ్ పైన ప్రతేక దృష్టి పెట్టి టాప్ కంపెనీలతో మాట్లాడి నిజామాబాదు మన ఐటి హబ్ కు తీసుకొచ్చే విదంగా కృషి చేస్తానని, ప్రస్తుత ఐటి మంత్రివర్యులు శ్రీధర్ బాబు దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఐటి హబ్ అభివృద్ధికి, అలాగే ఇక్కడ ఉన్న నిరుగ్యోగులకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు, డిగ్రీ, బిటెక్ చదువుతున్న, పూర్తి చేసిన నిరుద్యోగులు టాస్క్ ద్వారా ఐటీ, నాన్ ఐటీ రంగాలలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ తీసుకొని ఉపాధి అవకాశాలు పొందోచ్చాని ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఐటి హబ్ యాజమాన్యం, ఉద్యోగులు రాత్రి పని చేసే వారికీ బస్సు సౌకర్యం కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా డిపో మేనేజర్ తో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, కార్పొరేటర్స్, ఇల్లేందుల మమతా ప్రభాకర్, పంచారెడ్డి ప్రవళిక శ్రీధర్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, మాయావర్ సావిత రాజ్, మీసేవ శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# రైతులు అధర్య పడొద్దు... అండగా ఉంటాం.




**మంత్రి జూపల్లి కృష్ణారావు. నష్టపోయిన పంటలను పరిశీలించిన మంత్రి, షబ్బీర్ అలీ.**

**వేగుచుక్క న్యూస్, బిక్కనూర్, మార్చి 21:**

అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. గురువారం మండలంలోని అంతంపల్లి, జంగంపల్లి గ్రామాల్లో నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎకరాకు పదివేల రూపాయల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల కమిషన్ నుండి అనుమతి తీసుకుని రైతులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోవడం ఎంతో బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎంపీపీ గాల్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీంరెడ్డి, జిల్లా ఎన్నారై సెల్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

# అనుములకి ఎనుములకి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారు

**సీఎం రేవంత్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం**

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపాటు**

**హైదరాబాద్:** బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు సీఎం రేవంత్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, అనుములకి ఎనుములకి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారంటూ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చిత్రపురి సొసైటీలో జరిగిన అవినీతికి సీఎం రేవంత్ రెడ్డికి ఏంటి సంబంధమని ఆయన ప్రశ్నించారు. ఎప్పుడైనా రేవంత్ సోదరులో మహేంద్ర రెడ్డి అనే పేరు విన్నారా..? అని ఆయన ప్రశ్నించారు. నిజంగా మీ దగ్గర ఆధారాలు ఉంటే ప్రభుత్వానికి ఇవ్వండి తప్పకుండా వారిపై మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నిజంగా తప్పు చేస్తే మా కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరిని వదిలిపెట్టదన్నారు. కానీ అనవసరంగా కావాలని ఆరోపణలు చేస్తే చూస్తూ ఉరుకోమని, బీఆర్ఎస్ కి చిత్తశుద్ధి ఉంటే మిరే కదా గతంలో ప్రభుత్వం ఉంది మరి ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా..'అసలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నపుడు మేము ఏమి చేయలేదు అన్నట్లు మాట్లాడుతున్నారు. గతంలో మీడియా ను ,సోషల్ మీడియా ను బీఆర్ఎస్ కేసీఆర్ ఎలా అణిచివేశారో అందరికి తెలుసు. హుజురాబాద్ లో నా ఫోన్ తీసుకొని కేస్ పెట్టింది మర్చిపోయారు. పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరిన మిర్చి రైతులకు సంకెళ్లు వేసిన సంఘటన అప్పుడే మర్చిపోయారా.. ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తి చూపుతారని ధర్నా చౌక్ ఎత్తేసిన్నపుడు మాట్లాడని వారు ఇప్పుడు మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో ఇంట్లోకి వచ్చి అరెస్ట్ లు చేసిన సంఘటనలు మర్చిపోయారా.. నేను మాజీ సీఎం కేసీఆర్ గారి పుట్టిన రోజు చేస్తే.ఒక గాడిదకు ఫోటో వేస్తే గడిగా దొంగతనం జరిగిందని సుమోటోగా కేసులు పెట్టారు. నేను చేసిన కార్యక్రమం ఒకదగ్గరైతే సుమోటోగా రెండు చోట్ల కేసులు పెట్టారు. పోలీస్ స్టేషన్ తీసుకెళ్ళకుండా ఒక అధికారి ఇంటిపై రూమ్ లో లాక్ చేసి పెట్టారు. ఈ రోజు మీ పోస్ట్ పై ఫిర్యాదు చేస్తూ పోలీసులు వారిపని వారు చేశారు. మాది ప్రజా ప్రభుత్వం మీ బీఆర్ఎస్‌ల కాదు.. తప్పు చేసింది ఎవరైనా ఉరుకొము. కానీ ఆధారాలతో రండి ఊరికే బురదజల్లే ప్రయత్నం చేస్తే మాత్రం చూస్తూ ఉరుకొము. మేము బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ లుగా ఉన్నాము ఏమైనా మాట్లాడొచ్చు అంటే కుదరదు%ా% లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రభుత్వం చూస్తూ ఉరుకోదు తనపని తను చేసుకుపోతుంది. భజనలు చేయడం మానుకోండి. అనవసరంగా మా సీఎం గారి పై లేనిపోని ఆరోపణలు చేస్తే వదిలిపెట్టము. క్రిశాంక్ అన్న మీరు ఎప్పుడు మాలగా చెప్పలేదు. నేను మీడియా ముందు చెప్తున్నాను ఆధారాలు తీసుకొని అమరవీరుల స్థూపం వద్దకు రండి. డీజీపీ ఆఫీస్ కు వెళ్దాం..ఎవరు తప్పు చేసిన చర్యలు తీసుకుంటారు. క్రిశాంక్ అన్న కాంగ్రెస్ లో ఉన్నపుడు ఇద్దరం కలిసి ఉద్యమాలు చేస్తే ఇద్దరి పై కేసులు పెట్టిన విషయం మర్చిపోయారా.. అవస్తవాలు చెప్పడం మానుకోండి.. మీరు కేటీఆర్ , కవిత ఆ కుటుంబం మెప్పు పొందలనుకుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం లో ఎలాంటి అభివృద్ధి జరుగాకపోయి జరిగిందని చెప్పుకోండి. మీకు కావాల్సిన ఎమ్మెల్యే టికెట్ కోసం ఇలా మా ప్రభుత్వం పై అవస్తవాలు మాట్లాడడం మానుకోండి. కానీ మా సీఎం గారికి పై అనవసరంగా ఆరోపణలు చేయకండి. ఇలా అనవసరమైన సోషల్ మీడియా లో చేస్తే ప్రభుత్వం తన పని తాను చేసుకొనిపోతుంది.' అని బల్మూరి వెంకట్ వ్యాఖ్యానించారు.

## రాజమౌళి ఫ్యామిలీకి తృటిలో తప్పిన ప్రమాదం

**ఇబారకి ప్రిఫెక్చర్:** ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఫ్యామిలీకి తృటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న జక్కన ఫ్యామిలీ.. భూకంపం బారి నుంచి బయటపడ్డారు. ఈ విషయాన్ని రాజమౌళి కుమారుడు ఎస్ఎస్ కార్తికేయ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. తాము 28వ అంతస్థులో ఉండగా భూమి కంపించిందని, తాను భయాందోళనకు గురయ్యానని కార్తికేయ పేర్కొన్నారు. 'మేం 28వ అంతస్తులో ఉన్నాం. బిల్డింగ్ నెమ్మదిగా కదలడం ప్రారంభమైంది. అది భూకంపం అని గ్రహించడానికి మాకు కొంత సమయం పట్టింది. నేను భయాందోళనకు గురయ్యా. కానీ మా చుట్టూ ఉన్న జపనీయులందరూ ఎలాంటి ఆందోళన చెందలేదు. ఏదో వర్షం పడుతున్నంత ఈజీగా లైట్ తీసుకున్నారు. మొత్తానికి మేం భూకంపాన్ని ఎక్స్?పీరియెన్స్ చేశాం' అని ఎస్ఎస్ కార్తికేయ ఎక్స్‌లో పేర్కొన్నాడు. భూకంపం సమయంలో తన స్మార్ట్ వాచ్‌లో వచ్చిన వార్నింగ్‌ని ఫోటో తీసి ఆయన షేర్ చేశాడు. ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. రాజమౌళి ఫ్యామిలీ సేఫ్‌గా ఇండియాకి తిరిగి రావాలని ఫాన్స్ కోరుకుంటున్నారు.భూకంప తీవ్రత 5.3గా నమోదయిందని అమెరికా జియోలాజికల్ సర్వే ఓ ప్రకటనలో వెల్లడించింది. తూర్పు జపాన్‌లోని దక్షిణ ఇబారకి ప్రిఫెక్చర్‌లో 46 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం సంభవించింది. ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి ఫ్యామిలీ జపాన్ పర్యటనలో ఉంది.




# బీచ్‌లో రైమ్, క్లీంకార ఫుల్ ఎంజాయ్..

రామ్ చరణ్ ఉపాసన ఇద్దరూ కూడా వైజాగ్‌లో ఫుల్ చిల్ అయినట్టుగా కనిపిస్తోంది. ఎంచక్కా ఉదయం పూట, సాయంకాలం అలా బీచులో రైమ్, క్లీంకారతో కలిసి ఇలా చిల్ అయ్యారు. ప్రస్తుతం ఇంతటి క్యూట్ వీడియోను ఉపాసన షేర్ చేయడం తెగ వైరల్ అవుతోంది. రామ్ చరణ్ ఉపాసనలు వైజాగ్ బీచ్‌లో అలా తిరుగుతూ ఫుల్ చిల్ అయ్యారు. ఒకరు రైమ్‌ని, ఇంకొంకరు క్లీంకారను ఎత్తుకుని బీచ్‌లో ఆటలు ఆడుతున్నారు. రామ్ చరణ్ వల్ల గత నాలుగు రోజులుగా వైజాగ్ జనసంద్రంగా మారిన సంగతి తెలిసిందే. ఆర్కే బీచ్‌లో రామ్ చరణ్ తన గేమ్ చేంజర్ సినిమాను షూట్ చేశాడు. ఈ క్రమంలో అక్కడ అభిమానులు తండోపతండాలుగా కదిలి వచ్చారు. ఇక ఈ షూటింగ్ ప్యాకప్ తరువాత ఇలా ఫ్యామిలీతో కలిసి చిల్ అయినట్టుగా కనిపిస్తోంది.

ఇక క్లీంకార మోహం ఈ వీడియోలో కాస్త కనిపిస్తోంది. ఇక ఇదే మొదటి బీచ్ ఎక్స్ పీరియెన్స్ అంటూ క్లీంకార ఎంజాయ్ చేస్తున్న వీడియోని ఉపాసన షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో బాగానే ట్రెండ్ అవుతోంది. ఇక క్లీంకార బీచ్‌లోని చేపలను నిశితంగా గమనిస్తోంది. రైమ్ గాడు అలలతో ఆడేసుకుంటు న్నాడు. రామ్ చరణ్, ఉపాసనలు ఎంతో విలువైన సమయాన్ని బీచ్‌లో గడిపినట్టుగా కనిపిస్తోంది. గేమ్ చేంజర్ సినిమా కోసం రామ్ చరణ్ గత నాలుగు రోజులుగా వైజాగ్‌లోనే ఉన్న సంగతి తెలిసిందే. ఈ నాలుగు రోజులుగా ఆర్కే బీచ్‌లో జన సంద్రం కనిపిస్తోంది. ఆర్కే బీచ్ వద్ద రామ్ చరణ్ అభిమానుల్ని కంట్రోల్ చేయలేకపోయారు. జనాలు తండోపతండాలుగా కదిలి వచ్చారు. రామ్ చరణ్ ఫ్యాన్స్ చేసిన అల్లకల్లోలానికి ఇక్కడ సోషల్ మీడియా కూడా షేక్ అయిపోయింది. గత నాలుగు రోజులుగా వైజాగ్ రామ్ చరణ్ ఫ్యాన్స్ చేస్తున్న హంగామా అందరూ చూస్తూనే ఉన్నారు. రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా చాలానే సర్ ప్రైజ్‌లున్నాయి. నాయక్, మగధీర వంటి చిత్రాలు రీ రిలీజ్ అవుతున్నాయి. ఇక రేపు (మార్చి 20) బుచ్చిబాబుతో చేస్తున్న సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. రామ్ చరణ్ బర్త్ డే స్పెషల్‌గా గేమ్ చేంజర్ నుంచి జరగండి పాట రాబోతోందన్న సంగతి తెలిసిందే.





# మహేష్ సినిమాలో హృతిక్ రోషన్..

మహేష్ బాబు-రాజమౌళి సినిమాపై బజ్ మాములుగా లేదు. ఇక ట్విట్టర్‌లో అయితే దాదాపు ప్రతి రోజూ హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లో నే ఉంటుంది. అయితే తాజాగా ఈ సినిమా గురించి మరో న్యూస్ వైరల్ అవుతోంది. మహేష్ బాబుతో చేయబోతున్న తన కొత్త సినిమాపై డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి జపాన్‌లో చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. ఇక తాజాగా ఈ చిత్రం గురించి మరో న్యూస్ కూడా సోషల్ మీడియాలో తెగ తిరుగుతోంది. ఒకే స్క్రీన్‌పై ఇద్దరూ! సోషల్ మీడియాలో వస్తున్న రూమర్స్ ప్రకారం మహేష్ బాబుతో చేసే సినిమా కోసం హృతిక్ రోషన్‌ను రాజమౌళి కలిశారట.

ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో విలన్ రోల్ కోసం హృతిక్‌ను సంప్రదించారని టాక్. అన్నీ కుదిరితే ఒకే స్క్రీన్?పై ది మోస్ట్ హ్యాండ్సమ్ ఇండియన్ యాక్టర్స్ ఇద్దరినీ చూడొచ్చంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అయితే ఇది ఎంతవరకూ నిజం అనేది తెలియాల్సి ఉంది. ఎందుకంటే ఇటీవల జపాన్‌లో ఆర్ఆర్ఆర్ ప్రత్యేకం స్క్రీనింగ్ కోసం రాజమౌళి వెళ్లారు. ఆ సమయంలో తన తదుపరి సినిమా అయిన మహేష్ బాబు ప్రాజెక్టుపై స్పందిస్తూ కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఈ సినిమాకి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే పూర్తయిందని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయన్నారు. అయితే క్యాస్టింగ్ సెలక్షన్ ఇంకా పూర్తి కాలేదని క్లారిటీ కూడా ఇచ్చారు. అంటే దీన్ని బట్టి ఈ చిత్రం క్యాస్టింగ్ పనులను రాజమౌళి ఇంకా మొదలుపెట్టలేదని అనకోవచ్చు. కానీ ఇప్పటికే ఈ చిత్రంలో వీళ్లున్నారు, వాళ్లు నటిస్తు న్నారు అంటూ రోజుకో వార్త సోషల్ మీడియాలో కనిపిస్తుంది. మరి ఇది కూడా అలానే అనుకోవాలా లేక సంప్రదించిన మాట వాస్తవమేనా అన్న విషయం కాలమే నిర్ణయిం చాలి. కానీ మహేష్ సినిమాలో హృతిక్ నటిస్తే అద్భుతంగా ఉంటుందంటూ ఫ్యాన్స్ కూడా అనుకుంటున్నారు. మరి వాళ్ల కోరిక తీరుతుందో లేదో చూడాలి.



# ఇదెక్కడి కాంబో మావా..

షార్ట్ ఫిలిమ్స్ చేస్తూ కెరీర్ ప్రారంభించి ఇప్పుడు హీరోగా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు సుహాస్. ఇటీవలే అంబాజీ పేట మ్యారేజి బ్యాండుతో హిట్ కూడా కొట్టేశాడు. సినిమాల్లో కొన్ని కాంబోలో అస్సలు ఊహించలేం. అలాంటి ఓ కాంబినేషన్‌యే ఇది. కమెడియన్‌గా ఎంట్రీ ఇచ్చి హీరోగా ఇండస్ట్రీలో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సుహాస్ త్వరలోనే కీర్తి సురేష్‌తో నటించబోతున్నాడు. వీళ్లిద్దరి కాంబోలో 'ఉప్పు కప్పురంబు' అనే సినిమా రాబోతుంది. అయితే ఇది డైరెక్ట్ ఓటీటీలో రిలీజ్ కాబోతుంది. ఎందుకంటే అమెజాన్ ప్రైమ్ తన ఓటీటీ కోసం రూపొందిస్తున్న ఒరిజినల్ మూవీ ఇది. ఈ సినిమా విశేషాలు చూద్దాం.



ముంబై వేదికగా జరిగిన ప్రైమ్ ఈవెంట్‌లో ఈ ప్రాజెక్ట్‌ను అఫీషియల్‌గా ప్రకటించారు. ఇక ఉప్పు కప్పురంబు అనేది సెటైరికల్ కామెడీ జోనర్‌లో తెరకెక్కబోతుంది. ఇందులో కీర్తి సురేష్‌కి మంచి పెర్ఫామెన్స్ ఉన్న రోల్ ఆఫర్ చేశారట. అందుకే మహానటి ఒప్పుకుందని సమాచారం. ఇక ఈ సినిమా గురించి తెలియగానే సుహాస్ ఫ్యాన్స్ అయితే ఫుల్ ఖుషీగా ఉన్నారు. మహానటితో సుహాస్ నటించడం చాలా ఆనందంగా ఉందంటూ పోస్టులు పెడుతున్నారు. అయితే ఈ చిత్రంలో కీర్తి సురేష్-సుహాస్ జంటగా కనిపిస్తారా లేక ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారా అనేది చూడాలి. ఏది ఏమైనా సుహాస్ కెరీర్‌కి మాత్రం ఇది మంచి బూస్ట్ ఇచ్చేదిలానే కనిపిస్తుంది. ఇక సుహాస్ చేతిలో ప్రస్తుతం నాలుగైదు ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రసన్న వదనం, శ్రీరంగనీతులు, గొర్రె పురాణం, ఆనందరావు అడ్వెంచర్స్ సినిమాలతో టైట్ షెడ్యూల్‌లో ఉన్నాడు సుహాస్. ఇక గతేడాది రైటర్ పద్మభూషణ్, ఈ ఏడాది అంబాజీపేట మ్యారేజి బ్యాండుతో రెండు హిట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే హీరోగానే కాకుండా విలన్‌గా హిట్ 2లో కూడా ఆకట్టుకున్నాడు. హీరోగా చేస్తూనే మంచి పాత్రలు వస్తే వేరే సినిమాల్లో కూడా చేయడానికి రెడీగా ఉన్నట్లు సుహాస్ ఇప్పటికే చెప్పాడు.

టాలీవుడ్ టూ బాలీవుడ్ ఇక కీర్తి సురేష్ కెరీర్ విషయానికొస్తే ప్రస్తుతం టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. ఓవైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే నటనకి ప్రాధాన్యమున్ లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ నటిస్తుంది. ప్రస్తుతం రఘుతాత, కన్నివేడి, రివాల్వర్ రీటా వంటి చిత్రాలు కీర్తి చేతిలో ఉన్నాయి. ఇక ఇవి కాకుండా తమిళ సినిమా 'తేరి' రీమేక్ అయిన 'బేబీ జాన్' సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తుంది మహానటి.



# ఫ్యాన్స్ కోసం ఏం చేస్తున్నారో తెలుసా..!

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో విశ్వంభర సినిమాని చేస్తున్న విషయం తెల్సిందే. మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో విశ్వంభర సినిమాని చేస్తున్న విషయం తెల్సిందే. భారీ అంచనాల నడుమ భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయబోతున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటన వచ్చింది. విడుదలకు ఇంకా చాలా సమయం ఉన్నా కూడా విశ్వంభర యూనిట్ సభ్యులు మాత్రం స్పీడ్ గా చిత్రీకరణ చేస్తున్నారు. మొన్నటి వరకు పాట చిత్రీకరణ చేసిన టీం ఒక్క రోజు కూడా గ్యాప్ తీసుకోకుండా వెంటనే యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ మొదలు పెట్టారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేకంగా వేసిన సెట్ లో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ చేస్తున్నారు. అక్కడ బురద నీరు, దుమ్ములో విశ్వంభర యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ చేస్తున్నారు. చిరంజీవి ఒంటి నిండ బురదతో పాటు, దుమ్ములో చాలా ఇబ్బంది పడుతున్నారట. అయినా కూడా డూప్ లేకుండానే చిరు ఈ ఫైటింగ్ సీన్ చేస్తున్నారట. చిరంజీవి కావాలి అనుకుంటే డూప్ పెట్టి బురద సన్నివేశాలను మేనేజ్ చేయగలరు. కానీ చిరంజీవి తానే స్వయంగా చేయాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఫ్యాన్స్ థ్రిల్ ఫీల్ అవ్వాలనే ఉద్దేశ్యంతో బురదలో కష్టమైనా కూడా యాక్షన్ సన్నివేశాలను చిరంజీవి చేస్తున్నారు. బింబిసార చిత్రం తర్వాత దర్శకుడు వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమా ను భారీ ఎత్తున రూపొందిస్తున్నారు. త్రిష హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో పలువురు స్టార్స్ కనిపించబోతున్న ట్లు సమాచారం అందుతోంది.



# లెక్క తేలేది ఆరోజే!

టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో క్రియేటివ్ డైరెక్టర్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్నాడు సుకుమార్. టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో క్రియేటివ్ డైరెక్టర్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్నాడు సుకుమార్. మొదటి సినిమా నుంచి ప్రతి కథలో కూడా మ్ వైవిధ్యాన్ని చూపిస్తూ తన హెూదాను పెంచుకున్నాడు. ఇక పుష్ప సినిమాతో ఎలాంటి గుర్తింపు దక్కిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా బాలీవుడ్ లో కూడా ఇప్పుడు సుకుమార్ కు మంచి డిమాండ్ అయితే ఏర్పడింది. పుష్ప 2పై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. కేవలం తెలుగులోనే కాకుండా నార్త్ ఇండియాలోనూ సినిమాకు మంచి డీల్స్ దొరికే అవకాశం అయితే ఉంది. దాదాపు 1000 కోట్ల బిజినెస్ టార్గెట్ గా పుష్ప 2 సినిమా రూపొందుతోంది. ఇక ఈ సినిమా తర్వాత సుకుమార్ ఏ హీరోతో చేస్తాడు అనే విషయం కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారిపోయింది. చాలా రోజులుగా వినిపిస్తున్న మాట ఏమిటి అంటే.. సుకుమార్ లిస్టులో రామ్ చరణ్ ఉన్నాడు అని. ఒక విధంగా గతంలోనే ఈ కాంబినేషన్ పై రాజమౌళి ఒక క్లారిటీ ఇచ్చారు. ఇంటర్వ్యూలలో సుకుమార్ రామ్ చరణ్ కాంబినేషన్లో మరో సినిమా ఉంటుంది అని అందుకు సంబంధించిన స్టోరీ గురించి కూడా తనకు తెలుసు అని వివరణ ఇచ్చాడు. ఇక సుకుమార్ పుష్ప తర్వాత రామ్ చరణ్ తో తప్పకుండా సినిమా చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తూ ఉన్నాయి. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న బిజిలో ఒక ఏడాది అనంతరం రామ్ చరణ్ సుకుమార్ కు కాస్త స్పేస్ దొరికే అవకాశం కనిపిస్తోంది. ఇక సుకుమార్ రామ్ చరణ్ కాంబినేషన్ పై ఒక అఫీషియల్ అప్డేట్ ఇవ్వడానికి కూడా రెడీ అవుతున్నట్లు సమాచారం. మార్చి 27వ తేదీన రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో అదే రోజు అతని భవిష్యత్తు సినిమాలపై అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది.ఇక అందులో భాగంగానే సుకుమార్ ప్రాజెక్టుపై కూడా ఒక అఫీషియల్ క్లారిటీ ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రామ్ చరణ్ గేమ్ చేంజర్ సినిమాతో బిజీగా ఉన్నాడు. అలాగే ఇప్పుడు బుచ్చిబాబుతో తన 16 సినిమాను కూడా అఫీషియల్ గా లాంచ్ చేశాడు. ఇక ఈ రెండు సినిమాల తర్వాత సుకుమార్ తో ప్రాజెక్టును చేయాలి అని అనుకుంటున్నాడు. ఇక రంగస్థలంతో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు క్రియేట్ చేసిన ఈ కాంబినేషన్ నుంచి నెక్ట్స్ ఎలాంటి సినిమా వస్తుందనేది హాట్ టాపిక్ గా మారిపోయింది. మరో వైపు సుకుమార్ పుష్ప 2కి కొనసాగింపుగా మూడవ భాగం ఉంటుంది అని కూడా రకరకాల గాసిప్స్ వస్తున్నాయి. మరి దీనిపై ఎప్పుడు క్లారిటీ వస్తుందో కాలమే సమాధానం చెప్పాలి.



# 45 సెకన్ల స్పీచ్ కి 3 వారాల ప్రాక్టీస్

తాజాగా రాజమౌళి అప్పటి అవార్డు వేడుక అనుభవాలను జపాన్ లో అభిమానులతో షేర్ చేసుకున్నాడు.టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో రూపొంది 2022లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆర్ ఆర్ ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డ్ దక్కిన విషయం తెల్సిందే. ఒక ఇండియన్ మూవీకి, ఒక ఇండియన్ పాటకు మొదటి సారి ఆస్కార్ రావడంతో ప్రపంచం మొత్తం తిరిగి చూసింది. నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డును అందుకునేందుకు సంగీత దర్శకుడు కీరవాణి అకాడమీ అవార్డు వేడుకల కార్యక్రమానికి హాజరు అయిన విషయం తెల్సిందే. స్టేజ్ ఎక్కి 45 సెకన్లు మాట్లాడిన కీరవాణి మొత్తం దేశం తన వైపు తిరిగి చూసుకునేలా చేశాడు. మాట్లాడింది కొంతే అయినా కూడా అందులో చాలా విషయాలను కీరవాణి పేర్కొన్నాడు. తాజాగా రాజమౌళి అప్పటి అవార్డు వేడుక అనుభవాలను జపాన్ లో అభిమానులతో షేర్ చేసుకున్నాడు. జపాన్ లోని ఒక థియేటర్‌లో ఆర్ఆర్ఆర్ సినిమా 500 రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాజమౌళి అండ్ టీం అక్కడకు వెళ్లారు. ఆసమయంలో ఆస్కార్ అవార్డు వేడుక అనుభవాలను షేర్ చేసుకున్నాడు. నాటు నాటు నామినేట్ అయిన సమయంలో కచ్చితంగా అవార్డు వస్తుందని భావించాం. అందుకే అన్న కీరవాణి తో స్టేజ్ పై స్పీచ్ ను ప్రాక్టీస్ చేయించాం. 45 సెకన్ల సమయం మాత్రమే ఇస్తారు కనుక అందుకు తగ్గట్లుగా ఆయన్ను ప్రిపేర్ చేశాం. దాదాపు మూడు వారాల పాటు అన్నయ్య తో ప్రిపరేషన్ చేయించాం. అన్నయ్య కాస్త లావుగా ఉంటారు. కనుక సీటు నుంచి లేచి స్పీడ్‌గా వెళ్లి మెట్టు ఎక్కిన తర్వాత మాట్లాడటం కాస్త ఇబ్బంది. అందుకే ఆయన్ను కాస్త మెల్లగానే స్టేజ్ పైకి వెళ్లమని చెప్పాము. చాలా విషయాలు చెప్పి అకాడమీ అవార్డుల వేడుకకు తీసుకు వెళ్లాము. అవార్డు ప్రకటించిన వెంటనే మెల్లగా కాకుండా చాలా స్పీడ్ గానే అన్నయ్య నడుచుకుంటూ వెళ్లి అవార్డును అందుకున్నాడు. అయితే ఏదోలా ఇబ్బంది లేకుండా ఆయన అనుకున్నది మాట్లాడేసి వచ్చారు అంటూ రాజమౌళి అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నాడు.

# నష్టపోయిన నన్ను పైకి లేపింది ఆయనే!

కలెక్షన్ కింగ్ మోహన్ బాబు- తిరుపతిలోని యూనివర్సిటీ 32వ యాన్యువల్ డే కార్యక్రమం నిన్నటి రోజున గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసిన సంగతి తెలిసిందే. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు- తిరుపతిలోని యూనివర్సిటీ 32వ యాన్యువల్ డే కార్యక్రమం నిన్నటి రోజున గ్రాండ్ గా సెలబ్రేట్ చేసిన సంగతి తెలిసిందే. రెండు కార్యక్రమాలు ఒకే రోజు రావడంతో వేదిక ఒకటైంది. దీంతో ఈ కార్యక్రమానికి మలయాళం స్టార్ మోహన్ లాల్ ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా మోహన్ లాల్‌ని ఉద్దేశించి మోహన్ బాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు.






# అసలు విషయాన్ని దాస్తున్నారు..!

తమిళ సినీ ప్రేక్షకులతో పాటు అన్ని భాషల ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో కంగువ ఒకటి అనడంలో సందేహం లేదు తమిళ సినీ ప్రేక్షకులతో పాటు అన్ని భాషల ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో కంగువ ఒకటి అనడంలో సందేహం లేదు. తమిళ స్టార్ హీరో సూర్య హీరోగా యాక్షన్ చిత్రాలకు పేరు గాంచిన దర్శకుడు శివ భారీ బడ్జెట్ తో కంగువ సినిమాను బాహుబలి రేంజ్ లో రూపొందిస్తున్నాడు అంటూ తమిళ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇటీవల విడుదల అయిన పోస్టర్స్ మరియు టీజర్ సినిమా పై అంచనాలు భారీగా పెంచేశాయి. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు, సూర్య పాత్ర మరియు బాబీ డియోల్ కు సంబంధించిన సన్నివేశాలు సినిమా స్థాయిని అమాంతం పెంచడం ఖాయం అంటూ తమిళ మీడియా వారు తెగ కథనాలు రాస్తున్నారు.ఆ సూపర్ స్టార్ ఏమన్నారంటే.. ఈ సమయంలోనే టీజర్ లో మరియు పబ్లిసిటీ స్టఫ్ లో ఇప్పటి వరకు సినిమా కు సంబంధించి పీరియాడిక్ మూవీ అన్నట్లు చూపిస్తున్నారు. కానీ ఇదే సినిమాలో సమకాలీనంగా గోవా సన్నివేశాలు ఉంటాయి. ఆ విషయాన్ని గతంలో నిర్మాత అధికారికంగా ప్రకటించాడు. కానీ ఇప్పటి వరకు అలాంటి సన్నివేశాల తాలూకు లుక్ కానీ, షాట్స్ కానీ విడుదల చేయలేదు. టీజర్ లో ఆ విషయాలను కాస్త అయినా టచ్ చేసి ఉంటే బాగుండేది. సినిమా పై ప్రేక్షకుల్లో ఒక అభిప్రాయంను క్రియేట్ చేసిన టీజర్ లో ఆ విషయాలను చూపించక పోవడం వల్ల సినిమా చూసే సమయంలో ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చే అవకాశాలు ఉన్నాయి. కంగువ విడుదలకు ఇంకా చాలా సమయం ఉన్న కారణంగా మరో టీజర్ విడుదల చేయడంతో పాటు ట్రైలర్ విడుదల చేయాల్సి ఉంటుంది. అందులో ఇప్పటి వరకు దాచిన విషయాలను రివీల్ చేస్తూ మేకర్స్ సస్పెన్స్ కి తెర దించుతారేమో చూడాలి. ఆ విషయాన్ని అలాగే దాచి ఉంచి సినిమా ను విడుదల చేస్తే మాత్రం ప్రేక్షకులు కచ్చితంగా విభిన్నంగా స్పందించే అవకాశాలు ఉన్నాయి.

# ప్రశాంత్ వర్మ సెట్స్ లో నయా డైరెక్టర్..



టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో క్రియేటివ్ డైరెక్టర్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్నాడు సుకుమార్. టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో క్రియేటివ్ డైరెక్టర్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్నాడు సుకుమార్. మొదటి సినిమా నుంచి ప్రతి కథలో కూడా మ్ వైవిధ్యాన్ని చూపిస్తూ తన హెూదాను పెంచుకున్నాడు. ఇక పుష్ప సినిమాతో ఎలాంటి గుర్తింపు దక్కిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా బాలీవుడ్ లో కూడా ఇప్పుడు సుకుమార్ కు మంచి డిమాండ్ అయితే ఏర్పడింది. పుష్ప 2పై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. కేవలం తెలుగులోనే కాకుండా నార్త్ ఇండియాలోనూ సినిమాకు మంచి డీల్స్ దొరికే అవకాశం అయితే ఉంది. దాదాపు 1000 కోట్ల బిజినెస్ టార్గెట్ గా పుష్ప 2 సినిమా రూపొందుతోంది. ఇక ఈ సినిమా తర్వాత సుకుమార్ ఏ హీరోతో చేస్తాడు అనే విషయం కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారిపోయింది. చాలా రోజులుగా వినిపిస్తున్న మాట ఏమిటి అంటే.. సుకుమార్ లిస్టులో రామ్ చరణ్ ఉన్నాడు అని. ఒక విధంగా గతంలోనే ఈ కాంబినేషన్ పై రాజమౌళి ఒక క్లారిటీ ఇచ్చారు. ఇంటర్వ్యూలలో సుకుమార్ రామ్ చరణ్ కాంబినేషన్లో మరో సినిమా ఉంటుంది అని అందుకు సంబంధించిన స్టోరీ గురించి కూడా తనకు తెలుసు అని వివరణ ఇచ్చాడు. ఇక సుకుమార్ పుష్ప తర్వాత రామ్ చరణ్ తో తప్పకుండా సినిమా చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తూ ఉన్నాయి. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న బిజిలో ఒక ఏడాది అనంతరం రామ్ చరణ్ సుకుమార్ కు కాస్త స్పేస్ దొరికే అవకాశం కనిపిస్తోంది. ఇక సుకుమార్ రామ్ చరణ్ కాంబినేషన్ పై ఒక అఫీషియల్ అప్డేట్ ఇవ్వడానికి కూడా రెడీ అవుతున్నట్లు సమాచారం. మార్చి 27వ తేదీన రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో అదే రోజు అతని భవిష్యత్తు సినిమాలపై అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది.ఇక అందులో భాగంగానే సుకుమార్ ప్రాజెక్టుపై కూడా ఒక అఫీషియల్ క్లారిటీ ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రామ్ చరణ్ గేమ్ చేంజర్ సినిమాతో బిజీగా ఉన్నాడు. అలాగే ఇప్పుడు బుచ్చిబాబుతో తన 16 సినిమాను కూడా అఫీషియల్ గా లాంచ్ చేశాడు. ఇక ఈ రెండు సినిమాల తర్వాత సుకుమార్ తో ప్రాజెక్టును చేయాలి అని అనుకుంటున్నాడు. ఇక రంగస్థలంతో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు క్రియేట్ చేసిన ఈ కాంబినేషన్ నుంచి నెక్ట్స్ ఎలాంటి సినిమా వస్తుందనేది హాట్ టాపిక్ గా మారిపోయింది. మరో వైపు సుకుమార్ పుష్ప 2కి కొనసాగింపుగా మూడవ భాగం ఉంటుంది అని కూడా రకరకాల గాసిప్స్ వస్తున్నాయి. మరి ఎప్పుడు క్లారిటీ వస్తుందో చెప్పాలి.